సాక్షి నంద్యాల

బుధవారం : 11 : అక్టోబర్ : 2023



క్షేత్రపాలకుడికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధి గాంచిన బయలు వీరభద్ర స్వామికి, శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 1058 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.



పచ్చదనం పరిశుభ్రత

కర్నూలు కల్చరల్: సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులతో కలిసి లక్ష్మీజగన్నాథ గట్టుపై ఏపీ పర్యాటక సాంస్కృతిక శాఖ జిల్లా అధికారి విజయ పచ్చదనం పరిశుభ్రత చర్యలు చేపట్టారు.

న్యూస్‌రీల్

రేపే గృహ ప్రవేశాలు

- జగనన్న కాలనీలో పర్యటించిన జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి



జగనన్న లేఅవుట్-1లో పర్యటిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: పేదోడి సొంతింటి కల నెరవేరుతోంది. పట్టణ సమీపంలోని జగనన్న లేఅవుట్–1లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 200 ఇళ్లలో లబ్ధిదారులచే అధికారులు గృహ ప్రవేశా లు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మంగళవారం కాలనీలో పర్యటించి ఆర్బీ, రహదారి, కుళాయిల పనులను పరిశీలించారు. లబ్ధిదారులతోనూ మాట్లాడారు. ఈనెల 12న జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారుల గృహ ప్రవేశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిశోర్, డీఈ నాయబ్ రసూల్, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, ఏఈ అరుణ్ కుమార్, డీటీ సత్యనారాయణ, సర్వేయర్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం 852.30 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం మంగళవారం సాయంత్రం నాటికి 852.30 అడుగులకు చేరుకుంది. జలాశయానికి చాలా రోజులుగా వరద ప్రవాహం నిలిచిపోయిన విషయం తెలిసిందే, సోమవారం నుంచి మంగళవారం వరకు జలాశయం నుంచి 29,364 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 10.353 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 21,070 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 4,375 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,083 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 85.2060 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విద్యాశాఖ కార్యాలయంలో పదోన్నతుల జాబితా

నంద్యాల(న్యూటౌన్): ఆదర్శ పాఠశాలల టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఫైనల్ సీనియారిటీ జాబితా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉందని డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జాబితా ప్రకారం టీజీటీలు సర్వీసు రిజిస్టర్, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, మూడేళ్ల ఎనివల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టులతో వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ సూచించారు.

రేపు జిల్లా మత్స్య సహకార సంఘం సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా మత్స్య సహకార సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం ఈ నెల 12న నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్య శాఖ ఉప సంచాలకులు శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికల నిర్వహణ, నీటి వనరులలో చేప పిల్లల విడుదల, వలలు, పుట్టీల పంపిణీ పథకం తదితర అంశాలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రాథమిక మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

ఖరీఫ్ ఎండనివ్వకండి

- రూ.98.50 కోట్లతో నంద్యాలలో కలెక్టరేట్ నిర్మాణం
- శనగ విత్తనాల పంపిణీలో అలసత్వం వద్దు
- జగనన్న సురక్ష వైద్య శిబిరాలను సందర్శించండి
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- గైర్హాజరైన అధికారులపై చర్యలకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



హాజరైన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని వివిధ కెనాల్స్ కింద రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. నీటిపారుదల శాఖపై జరిగిన సమీక్షలో చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ కేసీ కెనాల్ కింద ఎన్ని ఎకరాల్లో పంటలు సాగయ్యాయని, ఎప్పటి వరకు నీటిని అందిస్తారని ప్రశ్నించారు. దేవనకొండ మండలంలోనే హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని నమ్ముకొని రైతులు 20 వేల ఎకరాల్లో వేరుశెనగ పంట సాగు చేశారని, ఎప్పటి వరకు నీటిని విడుదల చేస్తారో చెప్పాలని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ కోరారు. జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీరు రెడ్డి శేఖర్‌రెడ్డి సమాధానమిస్తూ కేసీ కెనాల్ కింద 90 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని, ఈ పంటలకు నవంబర్ 30వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తామని వివరించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాంగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో పవర్ జనరేషన్ కోసం 2 టీఎంసీలు వినియోగించుకుంటున్నారని, ఈ కెనాల్ నుంచి ఈ నెలాఖరు వరకు మాత్రమే నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉన్నా.. అతి కష్టం మీద నవంబర్ 15వ తేదీ వరకు నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎస్ఈ సమాధానంపై జెడ్పీ చైర్మన్ కొంత అసహనం వ్యక్తం చేశారు. అలాగే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తామని ఇంజినీర్లు చెప్పారు.

నేషనల్ హైవేస్ అధికారులకు నోటీసులు

క్షేత్ర స్థాయిలోని సమస్యలకు పరిష్కార వేదిక అయిన జెడ్పీ సమావేశాలపై కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చైర్మన్ పాపిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు ఈ సమావేశాల కంటే విలువైన కార్యక్రమాలు ఉంటే కనీసం సబ్జెక్టుపై అవగాహన ఉన్న సబార్డినేట్స్‌ను పంపించాలన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి సమావేశాలకు గైర్హాజరు అవుతున్న నేషనల్ హైవేస్ అనంతపురం, నంద్యాల జిల్లాల అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, నంద్యాల డీపీఓ మంజులావాణి, హౌసింగ్ కర్నూలు పీడీ సిద్ధలింగమూర్తి, పీఆర్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు కే సుబ్రమణ్యం, ఆర్ నాగరాజు, ఏవీ శ్రీధర్‌రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎం ఉమాపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ కే బుజ్జమ్మ, జెడ్పీటీసీలు పీ దివ్య, సుంకన్న, ఎస్ సుధాకర్‌రెడ్డి, బీ రఘునాథరెడ్డి, వీ రామక్రిష్ణ, కేవీ ఆర్ మహేశ్వరరెడ్డి, జీ శశంకర్‌రెడ్డి, బీ చంద్రశేఖర్, ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, రంగనాథ్‌గౌడ్, గోవిందమ్మ, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సులేమాన్, సయ్యద్ అస్లాం ఖాద్రీ తదితరులు హాజరయ్యారు.

12.75 ఎకరాల్లో నంద్యాల కలెక్టరేట్

జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా కేంద్రంలో రూ.98.50 కోట్లతో కలెక్టరేట్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ నంద్యాల ఎస్ఈ ఏవీ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఆర్అండ్‌బీపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఇన్ ప్రిన్సిపుల్ అప్రూవల్ అయ్యిందని, ఇక పాలనా అనుమతులు రావడమే తరువాయి అన్నారు. మొత్తం 12.75 ఎకరాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ 1.32 లక్షల ఎస్ఎఫ్‌టీ, ఫస్ట్ ఫ్లోర్ 87 వేల ఎస్ఎఫ్‌టీతో నిర్మించనున్నట్లు వివరించారు.

విత్తన పంపిణీపై దృష్టి సారించండి

నంద్యాల జిల్లాలో శనగ విత్తనాల పంపిణీలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వర్షాలు సకాలంలో కురవక పోవడం వల్ల రైతులు ఇబ్బంది పడడం లేదని, వర్షాలు కురిసి ఉంటే శనగ విత్తనాల కోసం ప్రైవేట్ డీలర్లపై ఆధార పడాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. ఇప్పటికైనా విత్తన పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్బీకేల్లోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, మండలాల్లో వ్యవసాయాధికారులు పరస్పర సహకారంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. అవుకు రిజర్వాయర్ పనులు జరుగుతున్న సమయంలో తాత్కాలికంగా రద్దు అయిన కొలిమిగుండ్ల - హైదరాబాద్ ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని చైర్మన్ కోరారు. కొలిమిగుండ్ల మండలంలోని మెజారిటీ గ్రామాలకు వైఎస్సార్ సుజల స్రవంతి కింద తాగునీరు సరఫరా చేసే వారని, వివిధ కారణాల వల్ల ప్రస్తుతం నాలుగైదు నెలలుగా నీరు సరఫరా చేయడం లేదన్నారు. వెంటనే పరిస్థితిని సమీక్షించి ఆయా గ్రామాలకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సందర్శించాలన్నారు.

అన్ని వర్గాలకు రుణాలు

- ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్



మెగా చెక్‌ను విడుదల చేస్తున్న ఏపీజీబీ చైర్మన్

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర అన్ని వర్గాల వారికి రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. మంగళవారం రీజినల్ కార్యాలయం ఆర్ఎం పీవీ రమణ ఆధ్వర్యంలో ఏపీ టూరిజం హరిత రిసార్ట్స్ మైదానంలో జరిగిన రుణ విస్తరణ కార్యక్రమంలో 150 మంది ఖాతాదారులకు గృహ, వాహన, వ్యక్తిగత, విద్య, వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.7 కోట్లు పంపిణీ చేశారు. ఏపీజీబీ అమలు చేస్తున్న రుణ పథకాలు, వడ్డీరేట్లపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్లను చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 61 శాఖలతో సెప్టెంబరు చివరి నాటికి రూ.5106.25 కోట్లతో అధిక వ్యాపార వాటా కలిగి ఉందన్నారు. రానున్న రోజుల్లో రుణ విస్తరణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం ఎం.సుబ్బారెడ్డి, సీనియర్ మేనేజర్ కె.రఘు, సరళ రుణ కేంద్రాల హెడ్ జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రీజినల్ కార్యాలయం మేనేజర్ రవితేజ, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీకి నేడు ఆఖరు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటలను నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకునేందుకు బుధవారం సాయంత్రం 6గంటలకు గడువు ముగియనుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్‌లో 10,09,865 ఎకరాల్లో పంటలు సాగు కాగా, 100 శాతం ఈక్రాప్‌లో నమోదయ్యాయన్నారు. అందులో మంగళవారం సాయంత్రానికి 8,79,355 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ధ్రువీకరిస్తూ ఈ-కేవైసీ చేయించుకున్నారు. మిగిలిన రైతులు బుధవారం సాయంత్రం 6 గంటల్లోపు ఆర్బీకేలకు వెళ్లి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కేవైసీ చేయించుకోని పంటలకు ప్రభుత్వ నుంచి ఎలాంటి ప్రయోజనాలు అందవన్నారు.

రోడ్డును తవ్విన టీడీపీ నాయకుడు

- మిగతా రైతులకు ఇబ్బందులు



రహదారిపై అడ్డంగా తవ్విన దృశ్యం

నంద్యాల(అర్బన్): తన పొలం మీదుగా ఏ రైతూ పొలాలకు వెళ్లడానికి వీలు లేదంటూ మండల పరిధిలోని మిట్నాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శీలం నాగతులశీశ్వరరెడ్డి కేసీ కెనాల్ పోరంబోకు రహదారిలో ప్రొక్లెయిన్‌తో గుంత తవ్వించాడు. శీలం నాగతులశీశ్వరరెడ్డి పొలం వద్ద ప్రారంభమైన రహదారి బోయ శివరామయ్య పొలం వరకు ఉంది. ఇదే రహదారి వెంట మరో ఏడుగురు రైతులు తమ పొలాలకు వెళ్లాల్సి ఉంది. అయితే రోడ్డుకు అడ్డంగా గుంత తవ్వడంతో తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఇప్పల గోపాల్‌రెడ్డి, చిన్నరామిరెడ్డి, బోయ చిన్న నరసింహులు, శివరామయ్య, లక్ష్మీనరసింహుడులు కేసీ కెనాల్ అధికారులకు మొరపెట్టుకున్నారు. రెవెన్యూ, కేసీ కెనాల్ అధికారులు చర్యలు తీసుకుని రహదారి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

దస్తగిరి స్వామి వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు



చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో రూ.55 లక్షలతో వివిధ కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన డీఎంఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయించడంతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. లక్ష్మీచెన్నకేశవ స్వామి బజార్, దస్తగిరి స్వామి బజార్, న్యూ బస్టాండ్ ప్రాంతాల్లో రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి.

పక్కాగా లెక్క!

- పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలకు చర్యలు
- 489 గ్రామాల్లో బ్యాంకు ఖాతాలు ప్రారంభం
- క్యూఆర్ కోడ్ స్వైపింగ్ మిషన్ల కోసం నిరీక్షణ

ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసిన ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అవినీతి రహిత లావాదేవీలు చేపట్టేందుకు పంచాయతీల్లో నగదు రహిత కార్యకలాపాలకు నడుంబిగించింది. అందులోభాగంగా రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్‌ల ద్వారా పంచాయతీల్లో జరిగే పన్ను వసూళ్ల అక్రమాలకు చెక్ పడనుంది.

– నంద్యాల(అర్బన్)

జిల్లా వ్యాప్తంగా 489 పంచాయతీల్లో బ్యాంకు ఖాతాలకు అనుసంధానంగా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. అన్ని పంచాయతీల పరిధిలో నగదు రహిత లావాదేవీలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నగదు రహితం ద్వారా అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలు అందించేందుకు సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చారు. కేవలం ప్రచార ఆర్భాటాలకే కాకుండా నగదు రహిత లావాదేవీలు చేపట్టేందుకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు బ్యాంకు ఖాతాలను ప్రారంభించారు. ఇకపై పంచాయతీల పరిధిలో ప్రజలు ఇల్లు, కుళాయి, ప్రకటన పన్ను వంటివి ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకున్నారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా రూ.14.65 కోట్లు పన్ను రూపంలో సమకూరింది.

సులభంగా పన్నుల చెల్లింపులు

ప్రజలు పన్నుల చెల్లింపుల్లో ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగితే సంబంధిత ప్రజలు ఎంత పన్ను చెల్లించాల్సి ఉంది. ఎంత చెల్లించారు.. ఎంత బకాయి ఉంది అనేది కూడా స్వయంగా తెలుసుకునే అవకాశం ఉంది. కేవలం బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఉంటే సరిపోయేలా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటివి ఉపయోగించి నగదును సులభతరంగా బదిలీ చేయవచ్చు. పంచాయతీల్లో కూడా లావాదేవీలు జరిపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రజల ముగింట్లోనే సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇకపై పన్నుల సొమ్ములను గడప వద్దే ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించే సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది.



కానాల గ్రామ పంచాయతీ

ఇకపై అక్రమాలకు చెక్



గ్రామ పంచాయతీలలో త్వరలో ఆన్‌లైన్ ద్వారా పన్ను వసూలు కోసం అన్ని చర్యలు తీసుకున్నాం. ఈ విధానం అమల్లోకి వస్తే అవినీతికి అవకాశం ఉండదు. జిల్లా వ్యాప్తంగా 489 పంచాయతీలకు బ్యాంకు ఖాతాలను ప్రారంభించి క్యూఆర్ కోడ్‌లను అందించాం. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలి.

– మంజులవాణి, డీపీఓ, నంద్యాల

మారుమూలలకూ వైద్య సేవలు



గిరిజనులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మహానంది: జగనన్న ప్రభుత్వంలో మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలు అందుతున్నాయి. మంగళవారం మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడెంలో తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గిరిజనులకు పలు వైద్యపరీక్షలు చేశారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి ఈ నెల 24న మహానందిలో ఏర్పాటు చేయనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరు కావాలని టోకెన్లు అందజేశారు.

యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ

మెడిసేవ డయాగ్నొస్టిక్స్

ఆత్మకూరు రోడ్, శ్రీనివాస నగర్, నంద్యాల

వాస్కులర్ కన్సల్టేషన్

12-10-2023 ప్రతి నెల 2వ గురువారం ఉ. 10 గం.ల - మ. 2 గం.ల వరకు



అపాయింట్ మెంట్ కొరకు: 915 497 5833



ఆదరణ స్తుతి కూడిక

కీ॥శే॥ శ్రీమతి కోలా రమాదేవి గారు

Rtd M.E.O.

భర్త: కీ॥శే॥ శ్రీ కోలా భాస్కర్ గారు Rtd. HM.

కుమారుడు

కోలా భరత్ కుమార్ Asst. General Manager

కోలా శరత్ కుమార్ Group Project head

కోడలు

డా॥ కోలా ఆశారంజని Vice Principal

డా॥ కోలా పూర్ణిమ Plastic Surgeon

కూతురు

మైత్రేయి Post Graduate Teacher

అల్లుడు

డా॥ మిద్దె ప్రేమ్‌చంద్ Dentist

మరిది కుటుంబం

శ్రీ కోలా ప్రసాద్ Head Master

శ్రీమతి కోలా రాజకుమారి Teacher

మౌనిక B.Tech

పల్లా హరిబాబు Software Manager

కోలా సుజిత్ కుమార్ B.Tech

కోలా దివ్య MBA

మనవళ్లు-మనవరాళ్లు: మాంటీ, బానీ, చిన్ను, సోను, క్యూటీ, స్వీటు, మీను, విన్ను

గమనిక: 11-10-2023 బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు, ఇ.నెం. 28-809ఎ2, విమార్ట్ సూపర్ మార్కెట్ వెనుక, ఎస్‌బీఐ కాలనీ, నంద్యాల నందు ఆదరణ కూడిక జరుగును. సెల్: 97899 91352

క్లుప్తంగా

రేపు ఉద్యోగ మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీరామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. బహుళ జాతి కంపెనీ సింక్రాన్ గ్రూప్ హైదరాబాద్‌లో పని చేయుటకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఇంటర్వ్యూలకు 2017 నుంచి 2023 మధ్య డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ప్రస్తుతం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కూడా ఇంటర్న్‌షిప్ చేయుటకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సుబ్బయ్య, ప్రగతిరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయం



కృష్ణగిరిలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కృష్ణగిరి: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధే లక్ష్యమని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ విశ్వమోహన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి సూచికలపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తూ మహిళ అభివృద్ధికి అనుగుణంగా అన్ని మౌళిక వసతులు ఉన్న గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం చిట్యాల, ఎరుకలచెర్వు, కటారుకొండ, చుంచుఎర్రగుడి గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. మీసేవా కేంద్రాల్లో సేవలకు తీసుకునే చార్జీలు, రిజిష్టర్లను పరిశీలించారు. సెంటర్లలో జగనన్నకు చెబుదాం పోస్టర్, సిటిజన్ చార్టర్, రేట్స్, మీసేవా లోగో తప్పక ఉండాలని ఆదేశించారు.

మేమింతే!

- పాఠశాలల తనిఖీని గాలికి వదిలేసిన జిల్లా విద్యాశాఖ
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న పలు విద్యా సంస్థలు
- ప్రైమరీ తరగతులకు అనుమతులు పొంది హైస్కూళ్ల నిర్వహణ
- ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేయాలని ఆర్‌జేడీ ఆదేశాలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న విద్యాధికారులు



కర్నూలు నగర పరిధిలోని కృష్ణానగర్‌లో ఉన్న భాష్యం స్కూల్ ఇది. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు నిర్వహణకు మాత్రమే ఈ స్కూల్‌కు అనుమతి ఉంది. అయితే, ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పాఠశాల తరగతులు సైతం నిర్వహిస్తున్నారు.

కర్నూలు సిటీ: జిల్లాలో కృష్ణానగర్ భాష్యం, వన్‌టౌన్‌లోని కస్తూరి స్కూళ్లు మాత్రమే కాదు దాదాపు ప్రభుత్వ గుర్తింపు పొందిన పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి (ఆర్‌జేడీ)వెంకట కృష్ణారెడ్డి గత నెల 23వ తేదీన జిల్లాకు వచ్చారు. ఆ సమయంలో ఆర్జేడీ జిల్లాలోని కల్లూరు, కర్నూలు అర్బన్, తాలూకా కేంద్రాల్లో ఉండే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను వారం, పది రోజుల్లో ప్రత్యేకంగా త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. డీఈఓ ఆఫీస్ ఏడీని స్వయంగా కనీసం మూడు స్కూళ్లను విజిట్ చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. అయితే ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక్క కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. నిబంధనల ప్రకారం అధికారులు ప్రతి స్కూల్‌కి వెళ్లి ఫీజు స్ట్రక్చర్, మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ విద్యార్హతలు, వసూలు చేసిన ఫీజుల రసీదు, పుస్తకాలు, విద్యార్థులకు సరిపడ గదులు, ఆట స్థలాలు ఉన్నాయా లేదా అని చూడాలి.లేకపోతే సదరు విద్యాసంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అయితే, ఈ విషయంలో ఉన్నత అధికారుల ఆదేశాలను సైతం జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

నోటీసులకే పరిమితం

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు 739 ఉన్నాయి. వీటిలో 1,59,719 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ స్కూళ్ల యాజమాన్యాలు ఎలాంటి నిబంధనలు పాటించకుండా అపార్ట్‌మెంట్లు, నివాస గృహాల్లో స్కూళ్లను నిర్వహిస్తున్నారు. 90 స్కూళ్లకు ఆట స్థలాలు లేవు. ఆటలు ఆడించేందుకు అత్యధిక స్కూళ్లలో పీఈటీలు ఉండరు. అలాగే గుర్తింపు పొందిన స్కూళ్లు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా? లేదా? అని మండల విద్యాధికారులు, డివిజన్ విద్యాధికారులు తనిఖీలు చేయాలి. రెగ్యులర్‌గా రికార్డులు పరిశీలించాలి. కానీ ఏ ఒక్క అధికారి తనిఖీలకు వెళ్లితే ఒట్టు. అధిక ఫీజుల వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తే సంబంధిత స్కూళ్లకు నోటీసులు ఇచ్చి చేతులుదులుపుకుంటున్నారు. దీంతో పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.



ఇది వన్‌టౌన్‌లోని కస్తూరి స్కూల్. అనుమతుల గడువు గతేడాదికే పూర్తి అయినా అలాగే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా యాజమాన్యం రెన్యూవల్ చేసుకోలేదు.. మరి కొద్ది రోజుల్లో వచ్చే ఏడాది పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను ఖరారు చేయాల్సి ఉంది.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం

పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతి స్కూల్ నిబంధనలు పాటించాల్సిందే. దీనిపై తనిఖీ చేసి ఉన్నతాధికారికి నివేదిక అందజేస్తాం. అనుమతులు లేని స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. – డా.వి. రంగారెడ్డి, డీఈఓ, కర్నూలు

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

కర్నూలు(హాస్పిటల్)/నంద్యాలటౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలను మంగళవారం ఆరోగ్యశాఖాధికారులు ప్రకటించారు.

మండలం/పట్టణం	వైద్యశిబిరం
ఎమ్మిగనూరు	మలకపురం
వెల్దుర్తి	పుల్లగుమ్మి
తుగ్గలి	జొన్నగిరి-1
పెద్దకడుబూరు	పీకలబెట్ట
పత్తికొండ	జూటూరు
ఓర్వకల్	లొద్దిపల్లె
నందవరం	పెద్దకొత్తిలి
మంత్రాలయం	మాలపల్లి
కర్నూలు	ఉల్చాల-1
క్రిష్ణగిరి	తొగరచేడు
కౌతాళం	నదిచాగి
కోసిగి	డి.బెళగల్
కోడుమూరు	వెంకటగిరి
కల్లూరు	పెద్దటేకూరు
హాలహర్వి	కామిన్‌హాల్
గూడూరు	ఆర్.ఖానాపురం
గోనెగండ్ల	గాజులదిన్నె
దేవనకొండ	గుండ్లకొండ
సి.బెళగల్	కంబదహాల్
ఆస్పరి	నగరూరు
ఆదోని	మందగేరి-2
నంద్యాల జిల్లాలో..	
అవుకు	అవుకు -2
వెలుగోడు	వెలుగోడు -2
గడివేముల	మంచాలకట్ట
పాణ్యం	సుగాలిమెట్ట
రుద్రవరం	పేరూరు
కొత్తపల్లె	దుద్యాల
ప్యాపిలి	పెద్దపుదేళ్ల
చాగలమర్రి	చాగలమర్రి -1
నందికొట్కూరు	నాగటూరు
గోస్పాడు	సాంబావరం
జూపాడు బంగ్లా	తర్తూరు
నంద్యాల	బిల్లలాపురం
ఆళ్లగడ్డ	కోటకందుకూరు
బనగానపల్లె	బనగానపల్లె-4
కోయిలకుంట్ల	కోయిలకుంట్ల -2
బేతంచెర్ల	గుటుపల్లె
బండి ఆత్మకూరు	చిన్నదేవళాపురం
దొర్నిపాడు	డబ్ల్యూ గోవిందిన్నె
పాములపాడు	మిట్టకందాల

ఇరువురి ఆత్మహత్యాయత్నం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో మంగళవారం సాయంత్రం ఇరువురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం నట్లకొత్తూరుకు చెందిన మధు అనే యువకుడి వద్ద ఏడాదిన్నర క్రితం ఉద్యోగం ఇప్పిస్తానని పట్టణానికి చెందిన రంగమ్మ అనే మహిళ రూ. 2 లక్షలు వసూలు చేసింది. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధిత యువకుడు ఆమె ఇంటి వద్దకు వెళ్లాడు. డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో అక్కడి నుంచి వచ్చిన మధు మనస్తాపం చెంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపర్‌వాజ్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆ యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో నంద్యాలకు తరలించారు. ఇరువురి మధ్య జరిగిన వాగ్వాదంతో మనస్తాపానికి గురైన రంగమ్మ సైతం సూపర్ వాజ్మోల్ తాగగా చికిత్స నిమిత్తం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటలనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మొబైల్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- ఎక్కువ ధరకు మొబైల్ విభాగాలను విక్రయిస్తున్నట్లు గుర్తింపు
- 18 దుకాణాలకు రూ. 1.93 లక్షల జరిమానా విధింపు



అంబికా మొబైల్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు: తక్కువ ధరలకు మొబైల్ విడి భాగాలను దిగుమతి చేసుకుని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు మొబైల్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి నీలం పూజిత ఆదేశాల మేరకు తూనికలు కొలతల శాఖ అధికారులతో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి కర్నూలులోని భూపాల్ రెసిడెన్సీలో ఉన్న మొబైల్స్ అండ్ ఆక్ససరీస్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇన్‌వాయిస్ బిల్లు, స్టాక్ రిజిస్టర్, లైసెన్స్, జీఎస్టీ చెల్లింపు, ఎంఆర్‌పీ ముద్రణ తదితర వివరాలను సేకరించారు. వినియోగదారులకు నిర్ణీత ధరలకు విక్రయించాలంటే మొబైల్ విడి భాగాలపై ఖచ్చితంగా ఎంఆర్‌పీ ముద్రించి ఉండాలని, అలా కాకుండా బిల్లులు కూడా ఇవ్వకుండా వ్యాపారులు ఎక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. బిల్లులు, ఇన్‌వాయిస్ రికార్డులు పరిశీలించి 18 దుకాణాల్లో మొబైల్ విడి భాగాలను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి రూ.1.93 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో సీఐలు కేశవరెడ్డి, నాగరాజు యాదవ్, సునిల్ కుమార్, రామకృష్ణతో పాటు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పాల్గొన్నారు.

కార్యనిర్వాహక ఇంజనీరు (వ్యవసాయ మార్కెటింగ్) వారి కార్యాలయము, కడప.
ఇ. ప్రోక్యూర్‌మెంటు టెండరు నోటీసు

టి.నో.నం.09/ఇఇ(ఎం)/కెడిపి/2023-24 తేది: 10.10.2023

కార్యనిర్వాహక ఇంజనీరు (వ్యవసాయ మార్కెటింగ్) కడప వారు కర్నూలు మార్కెట్ యార్డులోని అభివృద్ధి పనులు గాను అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైను ద్వారా టెండర్లు కోరుచున్నారు. మిగతా వివరములకు https://tender.apeprocurement.gov.in/ మీద సంప్రదించగలరు.

(కె. వెంకటేశ్వర రావు) కార్యనిర్వాహక ఇంజనీరు,(వ్యవసాయ మార్కెటింగ్), కడప.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ కార్యాలయం, కర్నూలు 4వ అంతస్తు కెఎన్ ఐకాన్ షాపి, బెస్ట్ ప్రైస్ వెనుక, బిర్లా కాంపౌండ్, కర్నూలు. ఆం.ప్ర-518003.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు మా శాఖ నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని అనేకసార్లు నోటీసులు పంపినను బకాయిలు చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **తేదీ:27-10-2023 (శుక్రవారం)**, సాయంత్రం. 4.00గం॥లకు మా శాఖల ఆవరణంలో బహిరంగ వేలం వేయబడును. వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరి సారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ. నెం.	లోన్ అకౌంట్ నెం.	శాఖ/రుణగ్రస్తుని పేరు	స్థూల బరువు గ్రాములలో
		అహోబిలం (18621)	
1	186216540001321	ముడె సాలమ్మ	10.00
		బుధవారపేట (00531)	
1	005316540000376	పోతురాజు గణేష్	27.00
		మహానంది (22131)	
1	221316540000917	షేక్ నబిరసూల్	19.30
2	221316540001411	షేక్ నబిరసూల్	33.60
		పద్మావతి నగర్ (27681)	
1	276830100022197	తప్పెట హేమలత	24.00
		సదాపురం (04122)	
1	560951011069342	ఆరెకంటి బుడ్డన్న	15.80
		శ్రీశైలం (05151)	
1	051516530000651	బలమూరి పరమేశ్వర్	8.25
		వెల్దుర్తి (19481)	
1	194830100049653	జరదొడ్డి వెంకటేశ్వర్లు	22.50

షరతులు: 1) వేలంలో పాల్గొనువారు రూ.5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) ధరావతు చెల్లించవలెను. 2) వేలంలో ఆభరణములు పొందినవారు ధరావతు సొమ్ము మినహాయించుకొని మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావతు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 3) ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డ్ కాపీలను బ్యాంకు వారికి సమర్పించవలెను.

తేది: 10.10.2023 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

టీబీ డ్యాంలో 50 టీఎంసీల నీరు

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో 50 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తిస్థాయిలో 105.788 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా డ్యాంలో 50 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నాయి. ఇక ఇన్‌ఫ్లో 1,374, ఔట్‌ఫ్లో 9,384 క్యూసెక్కులుగా నమోదైంది. తుంగభద్ర దిగువ కాలువకు సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 399 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ఐదు టిప్పర్లు పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : అనుమతులు లేకుండా మట్టి, మెటల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు పాణ్యం మండలం తమ్మారాజుపల్లె గ్రామంలో రెండు మట్టి టిప్పర్లు, వెల్దుర్తి వద్ద మూడు రోడ్డు మెటల్ టిప్పర్లను తనిఖీ చేసి సీజ్ చేసినట్లు వెల్లడించారు.వాటికి మొత్తం రూ. 75 వేలు జరిమానా విధించామన్నారు.

బాలిక అదృశ్యం

వెల్దుర్తి: ఎల్.నగరం గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆదివారం అదృశ్యమైంది. పొలం పనులకు వెళ్లిన కుటుంబసభ్యులు సాయంత్రం ఇంటికి రాగా ఇంటి వద్ద ఉండాల్సిన కుమార్తె కనబడలేదని తండ్రి రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన ఓ యువకుడిపై తమకు అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు మంగళవారం ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలుశిక్ష

ఆదోనిరూరల్ : మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో ఆదోని కోర్టు ఓ వ్యక్తికి 18 నెలల జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించింది. ఈ విషయాన్ని ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం విలేకరులకు తెలిపారు. 2022 ఏప్రిల్‌లో మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన హరిజన శేఖన్న అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఆదోని సెకండ్ అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వీరవెంకటనాగలక్ష్మి నిందితుడి శేఖన్నకు జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ వెల్లడించారు.

గోపవరంలో పరస్పర దాడి



గాయపడిన బాలచంద్రుడు,ప్రసాద్

మహానంది: పరస్పర దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి గోపవరం గ్రామంలో ఈ సంఘటన జరిగింది.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గోపవరం గ్రామానికి చెందిన బాలచంద్రుడు, ప్రసాద్‌ల మధ్య గత కొంత కాలంగా మనస్పర్ధలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇరువురి గొడవ పడ్డారు. బాలచంద్రుడు కర్రతో ప్రసాద్ తలకు కొట్టగా అతను కత్తితో ఛాతిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఇరువురికి రక్త గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలచంద్రుడికి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహేతర సంబంధమే పరస్పర దాడికి కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులను ప్రధానం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల టౌన్ / న్యూటౌన్: జిల్లా ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయంలో జిల్లా నియంత్రణ అధికారి శారదాబాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి చిన్నారుల్లో ఎయిడ్స్, క్షయ లాంటి భయంకరమైన వ్యాధుల పట్ల అవగాహన కలిగించాలని 5కే రన్‌తో పాటు రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. గత నెల 30న నిర్వహించిన క్విజ్ పోటీలలో పట్టణానికి చెందిన గురు రాజా పాఠశాలకు చెందిన జ్యోత్స్నకు ప్రథమ బహుమతి రూ. 5వేలు, కేఎస్‌ఎం మున్సిపల్ పాఠశాలకు చెందిన కేతిక సాగర్‌కు రెండో బహుమతి రూ 4 వేలు, ఇదే పాఠశాల విద్యార్థి రాకేష్‌కు మూడవ బహుమతి రూ. 3 వేలు, ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని తబస్సుం, వెలుగోడులోని కేజీబీవీ పాఠశాల విద్యార్థి ని అఖిలకు కాన్సోలేషన్ బహుమతులుగా వెయ్యి రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, సుబ్బరాయుడు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు

- ఆత్మకూరు ఫారెస్ట్ అధికారి పట్టాభి

కొత్తపల్లి: ఎవరైనా అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఫారెస్ట్ అధికారి పట్టాభి హెచ్చరించారు. రెండురోజుల క్రితం బలపాలతిప్ప, ఎరమ్రఠం చెంచుగూడెం, జానాలగూడెం గ్రామాలకు చెందిన ఐదుగురు వేటగాళ్లు బలపాలతిప్ప సమీపంలోని కుంట వద్ద కణితిని వేటాడారు. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు వెంటనే అక్కడికి వెళ్లారు. బలపాల తిప్ప గ్రామానికి చెందిన వేటగాడు బాలస్వామి పట్టుబడగా మిగతా నలుగురు ఘటనా స్థలంలోనే కణితి చర్మం, 6 కేజీల మాంసం, రెండు బాణాలు వదిలేసి పరారైనట్లు ఆత్మకూరు ఫారెస్ట్ అధికారి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. పరారైన నలుగురిలో ఎరమ్రఠం చెంచుగూడెంకు చెందిన నిమ్మల రాజు, గోపాల్, జానాల గూడెంకు చెందిన బయన్న , బలపాల తిప్పకు చెందిన నిమ్మల చిన్న బాలయ్య ఉన్నారని వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. అడవుల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేటగాళ్లు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు



దానం చేసిన నేత్రాలను సేకరిస్తున్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, డాక్టర్ మహేంద్రకుమార్

కర్నూలు(హాస్పిటల్): ఒకరి నేత్రదానం వల్ల ఇద్దరికి కంటి చూపు వస్తుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన సి. అనిల్‌కుమార్ అకస్మాత్తుగా ట్రాక్టర్ నుంచి కింద పడి మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించారన్నారు. అతని నేత్రాలు చూపులేని ఇద్దరికీ ఉపయోగపడతాయని భావించి కుటుంబసభ్యులు కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు మరణించిన వ్యక్తి నేత్రాలను సిబ్బంది సేకరించినట్లు తెలిపారు. ఇదే విధంగా మరణించిన తర్వాత ఆరు గంటలలోపు కార్నియా తీసుకుని కంటిచూపు లేనివారికి ఆపరేషన్ చేసి చూపు వచ్చే విధంగా ఆపరేషన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ మహేంద్రకుమార్, కమిటీ సభ్యులు డాక్టర్ జి. శ్రీనివాసులు, డాక్టర్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



తూకాన్ని పరిశీలిస్తున్న తూనికల కొలతల శాఖ అధికారి చల్లా దయాకర్ రెడ్డి

కర్నూలు (న్యూసిటీ): తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్ రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం సీ క్యాంప్, రైతు బజార్‌లలో పలు దుకాణాలను లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ధర్మకాటాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తూకాల విషయంలో వినియోగదారుల నమ్మకాన్ని పొందాలన్నారు. ఎలక్ట్రానిక్ ధర్మకాటాలను వినియోగించాలని సూచించారు.

అంటరానితనాన్ని రూపుమాపుదాం

- సీఐడీ కర్నూలు ఇన్‌చార్జ్ ప్రాంతీయ అధికారి పి. శ్రీనివాసులు



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ ఇన్‌చార్జ్ ప్రాంతీయ అధికారి శ్రీనివాసులు

కర్నూలు: కలిసికట్టుగా గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనాన్ని రూపుమాపుదామని సీఐడీ కర్నూలు ఇన్‌చార్జ్ ప్రాంతీయ అధికారి పి.శ్రీనివాసులు అన్నారు. కర్నూలు శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఆడిటోరియంలో షెడ్యూల్ కులాలు, తెగల వారికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమాజంలో వారి రక్షణ కొరకు తయారు చేసిన ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ 1989 గురించి విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సీఐడీ ఇన్‌చార్జ్ ప్రాంతీయ అధికారి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో పాటు భారీ ఎత్తున విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దిశ పీఎస్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కర్నూలు సీసీఎస్ డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, సీఐడీ డీఎస్పీ దైవప్రసాద్, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.వెంకటమోహన్‌రెడ్డి, ఝాన్సీలక్ష్మీ తదితరులు మాట్లాడుతూ అంటరానితనం రూపుమాపడంలో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐలు దేగల ప్రభాకర్, ఎస్‌ఎస్‌ఎం శ్రీధర్, జి.కొలుట్లయ్య, నగేష్ బాబు, ఖాదర్ బాషా, ఎస్‌కే రఫీ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలపై అవగాహన ఉండాలి

నంద్యాల టౌన్ : మానసిక రుగ్మతల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద కుమార్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత స్థిరమైన లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి శరీర ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత కోసం వ్యాయామం, పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం పోస్టర్ ప్రెజెంటేషన్ తదితర విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ "OPEN ···స్కూల్"· ఇంటర్ MPC, BIPC, CEC, HEC మరియు 10వ తరగతి "ఓపెన్-స్కూల్" అడ్మిషన్లు జరుగుచున్నవి. సం.ప్ర: రాయలసీమ స్కూల్, కర్నూలు. సెల్: 93982 52467 [L-798835]

■ Inter One Sitting EMTM. Limited Seats. MPC, BIPC, MEC, CEC, HEC, MBIPC శ్రీ విజయదుర్గ డిగ్రీ కళాశాల, కర్నూలు. 90306 28410, 93937 28410 [L-798836]

POLICE/SSC-GD/ARMY

■ వేలాది CRPF-CISF-BSF కానిస్టేబుల్ ఉద్యోగాలు కలవు. అ:10thపాస్, వ:18-28. వ్రాత పరీక్ష తెలుగులో ఉంటుంది. జాబ్ గ్యారెంటీ శిక్షణ. స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల. సెల్: 87908 44959 (Since:1999) [L-798830]

DISTANCE DEGREE & PG

■ Degree: B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLISc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLISc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: 90306 28410, 93937 28410 [L-798837]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

REAL ESTATE

PLOT FOR SALE

■ కర్నూలు పంచలింగాల హైవేకు అతి సమీపంలో ఐక్యమధ్యలో రెసిడెన్షియల్ ప్లాట్లు కలవు. మీ పెట్టుబడి అతి తక్కువ సమయంలో రెట్టింపు అయ్యే అవకాశం SARAVANAలో మాత్రమే. 99855 01110, 86868 53522 [L-798838]

SERVICES

BUSINESS

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41395]

WANTED

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 13,000/- - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD Ph: 8919613984 [HA-707]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 16k. Ph: 9640648899/ 9640528899 [HA-711]

■ కర్నూలు పట్టణంలో సెక్యూరిటీ గార్డులుగా డ్యూటీ చేయుటకు యువకులు కావలెను. జీతం రూ.10వేలు అపైన. సంప్రదించాల్సిన ఆఫీసు. భారత్ రక్షక్ కార్మిక్ ఆఫీసు, లక్ష్మీ నగర్, శ్రీ సత్యనారాయణ స్వామి గుడి ఎదురుగా, కర్నూలు. సెల్: 94940 33994, 94402 44422 [L-798839]

■ సూపర్‌వైజర్స్ కావలెను. కర్నూలు, నంద్యాల మునిసిపాలిటీ ఆంధ్రప్రదేశ్ (Clap Programme) నందు చెత్త సేకరణ ఆటోలను పర్యవేక్షించేందుకు అనుభవం గలవారు కావలెను. ✆ 89779 37517, 89781 11397 [B-788045]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.